క్లుప్తంగా

శ్రీగోదాదేవి అమ్మవారికి సారె సమర్పణ

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం శ్రీగోదాదేవి, శ్రీకృష్ణస్వామి వార్లకు సుప్రభాత సేవ, విశేష అర్చనలు నిర్వహించారు. అనంతరం శ్రీగోదాదేవి అమ్మవారికి సారెను సమర్పించారు. ఈ సందర్భంగా వంద కేజీల తులసి దళాలతో సహస్ర నామార్చన జరిపారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులు అమ్మవారికి వివిధ రకాల స్వీట్లు, పండ్లు, పసుపు కుంకుమ, పూలు, పట్టు చీరలు, ఆభరణాలను కానుకగా సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. ఆలయ అర్చకులు ఎస్.రామాచార్యులు, గన్నవరం, ఉయ్యూరు, పోరంకి, విజయవాడకు చెందిన ధనుర్మాస గోష్ఠి సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు బహుమతులు అందజేత

ఉయ్యూరు: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కాటూరు జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన కెరీర్ గైడెన్స్‌లో ప్రతిభావంతులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. పాఠశాలలో ఈ బహుమతులను శనివారం హెచ్ఎం రమాదేవి అందించారు. ఆమె మాట్లాడుతూ కెరీర్ గైడెన్స్‌పై 6,7,8,9 తరగతి విద్యార్థులకు ఈనెల 23న అవగాహన సదస్సు నిర్వహించి పోటీలు జరిపారన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించామన్నారు. కార్యక్రమంలో సేవా సంస్థ ప్రతినిధులు కొలసాని రవికుమార్, పినమాల నాగకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వికాస్ కళాశాలకు అటానమస్ హోదా

నున్న(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలోని వికాస్ ఇంజినీరింగ్ కళాశాలకు కాకినాడ జేఎన్‌టీయూ పర్మినెంట్ అఫిలియేషన్, ఢిల్లీ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అటానమస్ హోదాను మంజూరు చేశాయని వికాస్ విద్యా సంస్థల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి విలేకరుల సమావేశంలో తెలియజేశారు. స్థానిక ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం విలేకరుల సమావేశం జరిగింది. పర్మినెంట్ అఫిలియేషన్, ఢిల్లీ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అటానమస్ హోదా పత్రాలను జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కాకినాడ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జి.ప్రసాదరాజు చేతుల మీదుగా తనతో పాటు అకడమిక్ అడ్వైజర్ కీర్తి రెడ్డి అందుకున్నట్లు ఆయన తెలియజేశారు.

ప్రతి విద్యార్థిలో అమితమైన సామర్థ్యం

పెనమలూరు: ప్రతి విద్యార్థిలో అమితమైన సామర్థ్యం ఉంటుందని సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. కానూరు సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో సృజన-2023ను ఆయన శనివారం ప్రారంభించి ప్రసంగించారు. ప్రతి విద్యార్థిలో ఒక్కొక్క ప్రత్యేకత ఉంటుందని దానిని రుజువు చేసుకోవాలని సూచించారు. పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ఆర్ట్స్, క్రాఫ్ట్స్, ఎంబ్రాయిడరీ కళాఖండాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి కాకాని తరుణ్, అకాడమీ సభ్యుడు వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ మనోజ్ కర్మాకర్, వైస్ ప్రిన్సిపాల్ వి.సాయికృష్ణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిప్పరు డ్రైవర్లకు నిబంధనలపై అవగాహన

గన్నవరం: టిప్పరు డ్రైవర్లు నిబంధన ప్రకారం వాహనాలను నడపాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక వాహన పటుత్వ పరీక్ష కేంద్రంలో శనివారం టిప్పరు లారీ డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ ఇటీవల టిప్పర్ల వల్ల రోడ్డు ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు డ్రైవర్లు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వెనుక వచ్చే వాహనదారులకు ఇబ్బంది లేకుండా మట్టి, గ్రావెల్, ఇసుక, కంకర లోడ్‌పై తప్పనిసరిగా టార్పాలిన్లు కట్టాలని సూచించారు. టిప్పరు బాడీ లెవల్ వరకు మాత్రమే పరిమితికి మించి లోడ్ చేయాలని చెప్పారు. ముఖ్యంగా రాత్రి వేళ ప్రమాదాలు జరగకుండా టిప్పరు వెనుక భాగంలో రిఫ్లెక్టెడ్ టేపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. అపరిమిత వేగంతో టిప్పర్లు నడిపినా, నంబరు ప్లేట్లు కనిపించకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంవీఐలు డీవీ రమణ, మూర్తి, శివరామకృష్ణ గౌడ్, ఉదయ్ పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు అరెస్ట్

గన్నవరం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను గన్నవరం పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల సమాచారం ప్రకారం...మండలంలోని కేసరపల్లి, సూరంపల్లి గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్నట్లు గ్రామస్తుల నుంచి పోలీసులకు ఫిర్యాదులు అందాయి. డీఎస్పీ జయసూర్య ఆదేశాల మేరకు సీఐ పి. కనకారావు, ట్రైనీ డీఎస్పీ శ్రీవేద, ఎస్ఐలు శ్రీనివాస్, నాగరాజు, నవీన్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముగ్గురిపై కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఉయ్యూరు బైపాస్ మార్గంలో కమ్మిన పొగమంచు



కంకిపాడు-ఉయ్యూరు మార్గంలో జాతీయ రహదారిపై కమ్మిన మంచు తెరలు

హిమోత్పాతం...

కంకిపాడు-ఉయ్యూరు జాతీయ రహదారిపై శనివారం ఉదయం పొగమంచు దట్టంగా కమ్మేసింది. ఆకాశం నుంచి హిమోత్పాతం నేలపై వర్షించినట్టు రహదారి అంతా మంచుతెరలతో నిండిపోయింది. ప్రకృతి ఆరాధకులు ఆ సుమనోహర దృశ్యాన్ని చూసి ఆనందపరవశులయ్యారు. అయితే ఉదయం 10 గంటలైనా మంచుతెరలు వీడకపోవటంతో వాహనాలకు ఉన్న లైట్లను వినియోగించి ప్రయాణికులు రాకపోకలు సాగించారు. శనివారం ఉదయం కంకిపాడు, ఉయ్యూరు ప్రాంతాల్లో కనిపించిన దృశ్యాలివి.

– కంకిపాడు/ఉయ్యూరు

రోగులకు చిరునవ్వుతో సేవలందించాలి

- డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి
- ఘనంగా డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వర రావు డెంటల్ కళాశాల స్నాతకోత్సవం



పీజీ విద్యార్థినికి డిగ్రీ ప్రదానం చేస్తున్న రిజిస్ట్రార్ రాధికారెడ్డి, డైరెక్టర్ జనరల్ నాగేశ్వరరావు

గన్నవరంరూరల్: వైద్యులు రోగులకు చిరునవ్వుతో సేవలందించాలని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికా రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల 14వ గ్రాడ్యుయేషన్ స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రాధికారెడ్డి డెంటల్ వైద్యులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇప్పటినుంచి సమాజంలో వైద్యులుగా మీ బాధ్యత పెరుగుతుందని ఉన్నతమైన సేవలు అందిస్తే ప్రతిఫలంగా సంతృప్తి, గౌరవం, కీర్తి, డబ్బు లభిస్తాయని చెప్పారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు, మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ వైద్యులు చేతులతో, మనస్సుతో, విజ్ఞానంతో సేవలందించాలని చెప్పారు. వీటితో సేవలందించిన వారిని ప్రతి ఒక్కరూ ఉన్నతంగా చూస్తారన్నారు. కన్వీనర్ పి.రంగసాయి మధుసూదనరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు, హెచ్‌వోడీలు, బోధనా సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు. డిగ్రీలు స్వీకరించిన డాక్టర్లతో డాక్టర్ నాగేశ్వరరావు ప్రతిజ్ఞ చేయించారు. మొదట డాక్టర్ రాధికారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా 2018 బ్యాచ్ గ్రాడ్యుయేట్లు 114 మంది, 9వ బ్యాచ్ పోస్టు గ్రాడ్యుయేట్లు 28 మంది డిగ్రీలు స్వీకరించారు.

సమన్వయంతో పనిచేస్తేనే సమగ్ర ప్రగతి

ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి



శాఖల పనితీరుపై సమీక్షిస్తున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు

కంకిపాడు: సమన్వయంతో పనిచేస్తేనే సమగ్ర ప్రగతి సాధ్యమని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఆయా శాఖల పనితీరుపై సమీక్షించారు. చలివేంద్రపాలెంలో ఉన్న ఏడు ఇనుప విద్యుత్ స్తంభాలు అడుగు తుప్పు పట్టి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని, స్తంభాలను మార్చాలని సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి సూచించారు. ఇసుక కూపన్లు అందిస్తే ఇళ్ల నిర్మాణాలు వేగం అవుతాయని గొడవర్రు సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్ కోరారు. కంకిపాడులోని అంకమ్మతల్లి గుడి రోడ్డులో స్తంభాల ఏర్పాటు, ప్రధాన రహదారుల అభివృద్ధిపై వైస్ ఎంపీపీ ధూళిపూడి కృష్ణకిషోర్ అధికారులను ప్రశ్నించారు. ఆరోగ్య సేవలు, ప్రభుత్వ పథకాల సమాచారం ఏవీ తమకు అందటం లేదని అగ్రిబోర్డు మాజీ చైర్మన్ సత్తా వెంకటేశ్వరరావు, సర్పంచ్ పి.ఇందిర, ఎంపీటీసీలు వడుగు శ్రీనివాసరావు, బూరగ బాలాజీ తదితరులు సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేలా చూడాలన్నారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదన్నారు. సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. జెడ్పీటీసీ బాకీ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో సమర్థంగా సంక్షేమ పాలన అందిస్తుందన్నారు. పథకాల అమలులో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగితేనే అభివృద్ధి నెలకొంటుందని వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ పి.అనూష, వైస్ ఎంపీపీలు ధూళిపూడి కృష్ణకిషోర్, కలపాల ప్రకాష్, మండల పరిషత్ పరిపాలనాధికారి ఉదయ భాస్కర్, ఎంఈఓ ప్రసాద్ పలువురు మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వీఆర్ సిద్ధార్థలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులు

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. కాలేజీలో ఇంజినీరింగ్ పూర్తి చేసి దేశ విదేశాల్లో ఉన్న విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హరేకృష్ణ గోకుల క్షేత్రం అధ్యక్షుడు, విజయవాడ అక్షయపాత్ర నిర్వాహకుడు వంశీధరదాస మాట్లాడుతూ ప్రస్తుతం కాలేజీలో చదువుతున్న విద్యార్థులకు పూర్వ విద్యార్థులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు పి.రవికుమార్ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కాలేజీ కన్వీనర్ ఎం.రాజయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు డాక్టర్ ఎస్.రవికుమార్, సీహెచ్ జానకిరామ్, టీవీకే గుప్తా, అనుపమ, కె.సురేష్, గంగప్రసాద్, ఎం.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

అన్నార్తులు, అభాగ్యులకు అండగా నిలవాలి



పేదలకు నిత్యావసరాలు, స్వీట్లు అందజేస్తున్న జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి

కంకిపాడు: అన్నార్తులు, అభాగ్యులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి అన్నారు. విజయవాడకు చెందిన ఏసుపాదం చారిటబుల్ సొసైటీ, రాచూరి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కంకిపాడు పట్టణంలోని పేదలకు శనివారం నిత్యావసరాలు, ఆహార పొట్లాలు, స్వీట్లు పంపిణీ చేశారు. స్థానిక లాకు సెంటరులో నిర్వహించిన కార్యక్రమంలో చిరంజీవి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ పేదలకు అండగా ఉంటోందన్నారు. ప్రభుత్వంతో పాటుగా స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి పేదలకు ఆలంబనగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కంకిపాడు లాకులు సెంటరులోని ఎంపీపీ పాఠశాలను జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి విద్యా ప్రగతి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత తనిఖీ చేశారు. విద్యార్థులకు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్వీట్లు పంపిణీ చేశారు.

ముగిసిన సచివాలయ స్థాయి ఆటల పోటీలు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో జరుగుతున్న గ్రామ సచివాలయ స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ముగిశాయి. గన్నవరం-1,4 సచివాలయాలు, చినఅవుటపల్లి సచివాలయం పరిధిలోని క్రీడాకారులకు శనివారం క్రికెట్, ఖోఖో పోటీలు నిర్వహించారు. గన్నవరం-2, 3 సచివాలయాలు, కేసరపల్లి, ముస్తాబాద, సూరంపల్లి గ్రామ సచివాలయాల్లో కూడా పోటీలు ముగిశాయని నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త దనియాల నాగరాజు తెలిపారు. సచివాలయ స్థాయిలో ఎంపికైన టీమ్‌లకు జనవరి 2వ తేదీ నుంచి మండల స్థాయిలో పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు.

3 నుంచి 12 వరకు పింఛన్లు పంపిణీ

ఉంగుటూరు: మండలంలోని 16 గ్రామ సచివాలయాల్లోని పింఛన్ లబ్ధిదారులకు పెంచిన పింఛన్‌తో కలిపి రూ.3వేలు చొప్పున జనవరి 3నుంచి 12వ తేదీ వరకు వలంటీర్లు పంపిణీ చేస్తారని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. మండల వ్యాప్తంగా 8219 మంది లబ్ధిదారులకు పెంచిన పింఛన్ నగదుతో కలిపి పండుగ వాతావరణంలో పంపిణీ చేస్తారని అన్నారు.

నవోదయ, జెడ్పీ హైస్కూళ్లను తనిఖీ చేసిన డీఈవో

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించటం, విభిన్న అభ్యాసన విధానాల ద్వారా ఉత్పాదక, సహకార పౌరులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'పీఎం శ్రీ స్కూల్స్' పథకాన్ని ప్రారంభించినట్లు డీఈవో తాహెరా సుల్తానా చెప్పారు. బాపులపాడు మండలం వేలేరులోని కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థ అయిన జవహర్ నవోదయ విద్యాలయను శనివారం ఆమె సందర్శించారు. పీఎం శ్రీ స్కూల్స్ పథకం కింద వేలేరు నవోదయ విద్యాలయ ఎంపిక కావటంతో ఆ పాఠశాలలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. పాఠశాలలో అమలు చేస్తున్న విద్యా విషయక అంశాలు, విద్యార్థుల ప్రగతిని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు, హాస్టల్ వసతి, తరగతి గదుల్లో విద్యా బోధన తీరు తెన్నులను ఆరా తీశారు. అనంతరం వేలేరులోని జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాలలో మన బడి నాడు-నేడు కింద జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. త్వరలో జరగబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులతో ఆమె కొద్దిసేపు ముచ్చటించారు. ప్రభుత్వం సరఫరా చేసిన జగనన్న స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను క్షుణ్ణంగా చదివితే ఉత్తీర్ణులు కావటం ఖాయమని తెలిపారు. 8వ తరగతి విద్యార్థులకు ఇచ్చిన బైజూస్ కంటెంట్ ట్యాబ్‌ల వినియోగాన్ని అక్కడి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో-1 శ్రీరామ్ బాలసింగ్, ఎంఈవో-2 బి.సురేష్ కుమార్, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి జానీ సాహెబ్, నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ సుబ్బారావు, వేలేరు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కొమ్మా విజయ్ పాల్గొన్నారు.

రంగస్థల నటుడు జైరాజ్‌కు ఘన నివాళి



పెనమలూరు: ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి జైరాజ్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉన్న జైరాజ్ విగ్రహానికి తెలంగాణ ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీనేతలు మరీదు శ్రీనివాసరావు, బేతపూడి రవికాంత్, మరీదు వినయ్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

కానూరులో అయోధ్య అక్షింతలతో ఊరేగింపు

పెనమలూరు: కానూరు శ్రీవేణుగోపాల స్వామివారి ఆలయంలో అయోధ్య బాలరాముడి అక్షింతల కలశంతో గ్రామ పురవీధుల్లో శనివారం జైశ్రీరామ్ నినాదాలతో ఊరేగించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అయోధ్య అక్షింతలను ఆలయంలో బియ్యంలో కలిపి అక్షింతలు తయారు చేశారు. 1వ తేదీ నుంచి గ్రామంలో ప్రతి ఇంటికీ అక్షింతలు పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యుడు శ్రీనివాస్, ఆంజనేయులు, ఆలయ ధర్మకర్త అన్నే సుజాత, రామమోహన్‌రావు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



పెనమలూరు: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఏపీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ డాక్టర్ కేజీవీ సరిత అన్నారు. కానూరు గ్రామంలో స్కాట్ స్ప్రైస్ అంతర్జాతీయ పాఠశాలలో శుక్రవారం రాత్రి సంస్కృతి సారంగ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సరిత మాట్లాడుతూ విద్యార్థులు తమలో ఉన్న ప్రతిభను గుర్తించి, వాటికి మెరుగులు దిద్దుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ విశ్రాంత డైరెక్టర్ ఎంవైఎస్ ప్రసాద్, పాఠశాల చైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ, డైరెక్టర్ వీరమాచినేని శాంతి, సీఈవో కొడాలి జాహ్నవి, ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పెనమలూరు: గోసాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు అవటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పమిడిముక్కల మండలం గోపువానిపాలెం గ్రామానికి చెందిన కూరపాటి హర్షవర్ధన్ బైక్‌పై విజయవాడ నుంచి స్వగ్రామానికి వెళుతుండగా గోసాల సెంటర్ వద్ద వెనుక నుంచి వచ్చిన వ్యాన్ అతనిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో హర్షవర్ధన్ రోడ్డు పై పడిపోవటంతో గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న బంధువు కూరపాటి నరేష్‌కుమార్ గాయపడిన హర్షవర్ధన్‌ను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకు చేర్చాడు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆరుగురిపై బైండోవర్ కేసు

పెనమలూరు: యనమలకుదురులో ఆరుగురు వ్యక్తులపై పోలీసులు శనివారం బైండోవర్ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జి.వీరబాబు, ఎస్.భవాని కిషోర్, కొక్కిలిగడ్డ సీతారామయ్య, బలగం నాగరాజు, ఎస్.శివనారాయణ, జి.శ్రీను పేకాట శిబిరం నిర్వహించనున్నారన్న సమాచారంతో వారిపై ముందస్తుగా బైండోవర్ కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

న్యూ ఇయర్ వేడుకల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పెనమలూరు: న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ఎవరూ నిబంధనలు ఉల్లంఘించరాదని సీఐ టీవీవీ రామారావు తెలిపారు. న్యూ ఇయర్ వేడుకలను పురస్కరించుకుని ఆంక్షలు విధించామని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బార్‌లు, రెస్టారెంట్‌లు రాత్రి సకాలంలో మూసివేయాలని తెలిపారు. డీజేలు, మైకులు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేయరాదన్నారు. బహిరంగ ప్రాంతాల్లో టపాసులు కాల్చరాదన్నారు. రోడ్లపై రాత్రి సమయాల్లో గుంపులు గుంపులుగా ఉండకూడదని తెలిపారు. నూతన సంవత్సరం వేడుకలు అందరూ ఆనందంగా చేసుకోవాలని, పోలీసులతో సహకరించాలని సీఐ రామారావు విజ్ఞప్తిచేశారు.

విద్యారంగానికి అధిక ప్రాముఖ్యం



విద్యార్థులకు ట్యాబ్‌లు, స్టడీ మెటీరియల్స్ అందజేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

రామవరప్పాడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని జెడ్పీటీసీ సువర్ణరాజు అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, 10వ తరగతి విద్యార్థులకు స్ఫూర్తి స్టడీ మెటీరియల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి పరుస్తున్నారన్నారు. విద్యార్థులకు డిజిటల్ విద్యను చేరువ చేయాలనే ఉద్దేశంతో ట్యాబ్‌లను సీఎం జగన్ అందజేస్తున్నారన్నారు. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసించాలని సూచించారు. పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయురాలు తాయారు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న స్ఫూర్తి స్టడీ మెటీరియల్ పంపిణీ

విజయవాడరూరల్: జగనన్న స్ఫూర్తి ఉచిత స్టడీ మెటీరియల్‌ను విజయవాడ రూరల్ మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలలకు చెందిన 995 మంది పదవతరగతి విద్యార్థులకు పంపిణీ చేసినట్టు మండల విద్యాశాఖాధికారి ఎ.సూర్యబాబు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కొత్తూరు తాడేపల్లి గ్రామంలో 45 మంది విద్యార్థులకు, జక్కంపూడి కాలనీలో 86 మంది విద్యార్థులకు, గొల్లపూడిలో 40 మంది విద్యార్థులకు, ఎస్పీఎస్‌ఆర్‌సీ హైస్కూల్ గొల్లపూడి విద్యార్థులు 31 మందికి, నున్నలో 157 మంది విద్యార్థులకు, రామవరప్పాడులో 198 మందికి, నిడమానూరులో 328 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. వీరిలో 368 మంది తెలుగు మీడియం, 527 మంది ఇంగ్లిషు మీడియం విద్యార్థులున్నారని ఎంఈఓ సూరిబాబు తెలియజేశారు.

జలజీవరాసుల సంరక్షణకు ఫెన్సింగ్ నిర్మాణం



పాతపాడు చెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం

పాతపాడు(విజయవాడరూరల్): జలజీవరాసుల సంరక్షణ కోసం ఎన్విరాన్‌మెంటల్ ఫ్రెండ్లీ ఆఫ్ ఇండియా సంస్థ పాతపాడు గ్రామంలోని ఎర్ర చెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టింది. పాతపాడు గ్రామం అడవిలో వున్న కోతులు, పక్షులు ఇత్యాది జీవరాసులు వేసవి కాలంలో తాగునీటి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఉండేందుకు గ్రామంలోని ఎర్ర చెరువు చుట్టూ ఎన్విరాల్‌మెంటల్ ఫ్రెండ్లీ ఆఫ్ ఇండియా సంస్థ ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టినట్టు గ్రామ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావు తెలిపారు. చెరువులో నీరు ఇంకిపోకుండా ఉండేందుకు లోపలి భాగంలో నీరు నిల్వ ఉండే విధంగా ఇంకుడు గుంతలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెరువులో నీరు కలుషితం కాకుండా శుభ్రంగా ఉండే విధంగా చెత్త చెదారం వేయకుండా ఉండేందుకు గ్రామ పంచాయతీ సహకారాన్ని ఆ సంస్థ కోరిన మేరకు అంగీకరించినట్టు కార్యదర్శి తెలియజేశారు. చెరువు ఆయకట్టు రైతులకు కూడా పంట పొలాలకు సాగునీరు సమస్య రాకుండా ఉండేలా గ్రామ పంచాయతీ చర్యలు తీసుకుంటుందన్నారు.

ఆసక్తిగా జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు



కానూరులో జరుగుతున్న షటిల్ పోటీలు

పెనమలూరు: మండల పరిధిలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఆసక్తిగా జరుగుతున్నాయి. గ్రామాల్లోని క్రీడాకారులు పెద్ద సంఖ్యలో వచ్చి ఆటల పోటీల్లో పాల్గొంటున్నారు. వణుకూరు గ్రామంలో శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళలకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంపీడీఓ సునీతాశర్మ, ఏవో లోయ శివశంకర్‌రావు, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కానూరులో...

తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్ లో ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నారు. కమిషనర్ ఎన్.ప్రకాశరావు పర్యవేక్షణలో పోటీలు జరుగుతున్నాయి. శనివారం క్రికెట్‌లో 11 జట్లు, బ్యాడ్మింటన్‌లో 35 జట్లు పాల్గొన్నాయి.

సమాజ సేవలో రోటరీ క్లబ్ పాత్ర అసామాన్యం



విద్యార్థులకు దిండ్లు, పిల్లో కవర్‌లు అందజేసిన రోటరీ క్లబ్ అధ్యక్షుడు, రొటేరియన్‌లు

గన్నవరంరూరల్: సమాజ సేవలో రోటరీ క్లబ్ పాత్ర విశిష్టమైనదని గన్నవరం రోటరీక్లబ్ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్ చెప్పారు. చిన అవుటపల్లి పుణ్యా చారిటీస్ వృద్ధాశ్రమం ఆవరణలో శనివారం గన్నవరం ఎస్సీ, బీసీ హాస్టళ్ల విద్యార్థులకు 250 మందికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా దిండ్లు, పిల్లో కవర్‌లు పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి నర్రా సీతారామారావు, చింతపల్లి సీతారామయ్య, గన్నె వెంకట్రావు, టీఎస్ఆర్‌కే ప్రసాద్, సురేష్, రవిబాబు, బ్రహ్మం, దశరథ రామయ్య తదితరులు పాల్గొన్నారు.